

1 నుండి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు సందర్భంగా ఆలయ, ఉత్సవ కమిటీల చైర్మన్, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి రాష్ట్రస్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కొంటా దుర్గారావు, సిదరి రాంబాబు, బాకురు మహేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నమెంట్ పోటీలలో పాల్గొనే టీంలు ఈ నెల 26వ తేదీ సాయంత్రం లోపు రూ.3 వేలు ఎంట్రీ ఫీజుతో టీం పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.1.20 లక్షలు, ద్వితీయ రూ.60వేలు, బెస్ట్ టీమ్ కు రూ.20వేలు, మ్యాన్ ఆఫ్ ద సిరిస్ రూ.15వేలు, వ్యక్తిగత విభాగంలో ఒక్కొక్క విభాగానికి రూ.5వేలతో పాటు ట్రోఫీలను బహుమతిగా అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8919854104, 6302694492, 93477 97008 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

అరుకు కెకె లైన్లో పనిచేస్తున్న..

కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

-రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరుకు కేకే లైన్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు జీవో ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు.ఈ మేరకు గురువారం యూనియన్ ఆధ్వర్యంలో అరకులోయలోని ఆదివాసి గిరిజన సంఘం భవనంలో ఉద్యోగ భద్రత, జీవో ప్రకారం కనీస వేతనం అమలు వంటి అంశాలపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు కు ముఖ్యఅతిథిగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహులు హాజరై ప్రసంగించారు.అరుకు కేకే లైన్లో ట్రాక్మెన్ వర్కర్స్, శానిటేషన్, రన్నింగ్ రూమ్, గెస్ట్ హౌస్ లో సుమారు 200 మంది పనిచేస్తున్నారని, వీరంతా వెనకబడిన గిరిజనులేనని తెలిపారు. వీరికి కనీస వేతనాలు ఇతర పిఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు అమలు కాలేదని తెలిపారు. తక్షణం కార్మికులకు చట్ట ప్రకారం రావాల్సిన రాయితీలు చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే ను ప్రైవేటుకరించాలని చూస్తోందని, దీనిలో భాగంగానే రైల్వే స్టేషన్ను ఆధునికరించి కార్పొరేట్లకు అప్పచెప్పాలని ప్రయత్నిస్తుందన్నారు. ప్రైవేటీకరణ జరిగితే కాంట్రాక్ట్ కార్మికులకు, పర్మినెంట్ ఉద్యోగులకు కూడా ఉద్యోగ భద్రత ఉండదని తెలిపారు.కార్మికులు పోరాటం చేసి సాధించుకున్న కార్మిక చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి కొత్తగా నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేయాలని చూస్తుందని తెలిపారు.ఈ నాలుగు లేబర్ కోడ్స్తో కార్మికులకు ఎటువంటి ఉద్యోగ భద్రత, కనీస వేతన చట్టం, సామాజిక భద్రత ఉండదని తెలిపారు.

ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిట్టిబాబు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం గిరిజన హక్కులు, చట్టాలు లేకుండా చేయాలనే ప్రయత్నం చేస్తుందని తెలిపారు. జీవో 3 ఇప్పటికే కనుమరుగైందని దీంతో నిరుద్యోగులు దిక్కులేని పరిస్థితి అయిందని అన్నారు. 1/70 చట్టాన్ని చాప కింద నీరులా తొలగించాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఉందని అన్నారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వర మాట్లాడుతూ, భవిష్యత్తులో రైల్వే ప్రైవేటీకరణ, కార్మికులు ఉద్యోగ భద్రత కనీస వేతనం చట్టాలు అమలు చేయాలని పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సన్యాసిరావు, మహేష్, త్రినాధ్, బోరయ్య, కృష్ణ, బొడ్డవరం, ఎస్ కోట, మల్లి వీడు, బుర్ర, సిమిలిగూడ, కరకవలస, చిముడుపల్లి, అరకు తైడ స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరసింహులు



రాజేంద్రపాలెం సచివాలయంలో సమావేశమైన జెడ్పి సిఇఒ

మండలంలో జెడ్పి సిఇఒ విస్తృత పర్యటన

ప్రజాశక్తి-కొయ్యూరు

విశాఖపట్నం జిల్లా పరిషత్తు కార్యనిర్వాహణాధికారి పి.నారాయణమూర్తి గురువారం కొయ్యూరు మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ మరింత మెరుగుపర్చాలని ఆదేశించారు. రాజేంద్రపాలెం గ్రామ సచివాలయాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న పి-4 సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. రాజేంద్రపాలెంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఇంటింటి నుండి చెత్త సేకరణ జరిపి పంచాయతీకి ఆదాయం సమకూరేలా తగు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. కొయ్యురులోని జిల్లా పరిషత్ అతిథి గృహాన్ని సందర్శించి, దాని మరమ్మతులకు తగిన అంచనా రూ.20లక్షలు మంజూరు చేశామని, మంచి నాణ్యతతో సుందరంగా పనులు చేయాలని పంచాయతీ రాజ్ ఎఇని ఆదేశించారు. కొయ్యురు వీధిలోనూ, సాయిబాబా ఆలయం వద్ద మంచినీటి ట్యాంక్లను పరిశీలించారు. రోజువారీ ట్యాంక్ నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. వేసవికాలంలో నీటి సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యుఎస్ ఎఇకి సూచించారు. కొయ్యూరులో తాగునీటి ఎద్దడి గురించి తెలుసుకున్న ఆయన రాజేంద్రపాలెం ఉన్న గ్రావిటీ ద్వారా వచ్చే నీటిని ఆ గ్రామ ప్రజలతో మాట్లాడి వారికి అవసరాలకు పోను మిగులు నీటిని కొయ్యూరు గ్రామానికి వినియోగించడానికి తగు ఏర్పాట్లు చేయాలని ఎంపిడిఒను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బడుగు రమేష్, జెడ్పిటిసి వారా నూకరాజు, ఎంపీడీవో, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఇతర అధికారులు పాల్గొన్నారు.

నాటు సారా నిర్మూలనే లక్ష్యం

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్కుమార్

ప్రజాశక్తి -పాడేరు: నాటు సారా నిర్మూలనే నవోదయం 2.0 లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరం నుండి నాటు సారా నివారణపై రెవెన్యూ, అటవీశాఖ, పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్రమ నాటు సారా తయారీ దారులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని సూచించారు. నాటు సారా నివారణకు గ్రామస్తులు, ప్రజా ప్రతినిధుల సహకారం తీసుకోవాలని తెలియజేసారు. గ్రామ మండల స్థాయి, డివిజన్ స్థాయిలో ప్రత్యేకాధికారులను నియమిస్తామన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో నాటు సారా నిర్మూలన చర్యలు చేపట్టాలన్నారు. సారా తయారీని విడిచి పెట్టిన తయారీ దారులకు ప్రత్యామ్నాయంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. బెల్లం సరఫరా దారులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. సారా తాయారు చేసే గ్రామాలను ఎ. కేటగిరీగాను, తయారీ, పంపిణీ చేసే గ్రామాలను బి కేటగిరీ గ్రామాలుగాను, సారా వినియోగించే గ్రామాలను సి కేటగిరీగాను విభజించాలన్నారు. అటువంటి గ్రామాలపై దాడులు చేసి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నాటు సారా వినియోగంపై కలిగే నష్టాలను చెడు ప్రభావాన్ని వివరించాలన్నారు. సారా తయారీపై 14405 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలన్నారు.అనంతరం నవోదయం ప్రచార రథాన్ని ప్రారంభించారు.

జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ మాట్లాడుతూ, సారా నివారణకు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఇందుకుగాను మహిళా సంఘాల సహకారం తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఎన్.సుజిత్సింగ్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ పి.నాగ రాహుల్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్.రజని. పాడేరు ఐటిడిఏ ఇన్చార్జి పిఓ, అభిషేక్ గౌడ, చింతూరు పి.ఓ అపూర్వ భరత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, జిల్లా పంచాయతీ అధికారి బి. లవరాజు, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి పి.ఎస్. కుమార్ పాల్గొన్నారు.

7 న మెగా యోగాసనాల అభ్యసన

పాడేరు : వచ్చే నెల 7వ తేదీన నిర్వహించనున్న మెగా యోగాసనాల అభ్యసన కార్యక్రమానికి తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యోగాసనాల ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అరకు వ్యాలీ మండల కేంద్రంలో 20 వేల మంది విద్యార్థులతో మెగా యోగాసన అభ్యసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. అరకు వ్యాలీ డిగ్రీ కళాశాలల మైదానాన్ని సిద్ధం చేయాలని సూచించారు. తాగునీటి, రవాణా, విద్యుత్తు, స్టేజ్ ఏర్పాట్లు, పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. మైదానంలో ఐదు అంబులెన్సను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డి.ఆర్.ఓ. కె.పద్మలత, ఎమ్ఎసి లోకేష్, డిఎస్పీ షెహబాజ్ అహ్మద్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్.రజని, ఇఇ కె.వేణుగోపాల్, జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు, ఎఇ అభిషేక్, డి ఎస్ ఓ బి.గణేష్ యోగా గురువు పతంజలి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మంత్రితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

రహదారుల అభివృద్ధికి నిధులు ఇవ్వండి

-మంత్రి సంధ్యారాణిని కోరిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరు నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని టిడిపి ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని కోరారు. అమరావతి సచివాలయంలో గురువారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ సమస్యలను వివరించారు. రహదారుల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. సుమారు రూ.200 కోట్లకు పైగా నిధులు అవసరమని తెలిపారు. అదేవిధంగా అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణ రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి నిధులను మంజూరు చేయాలని, నియోజకవర్గంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి నిధులు విడుదల చేయాలని విన్నవించారు. ఓం శాంతి మందిర నిర్మాణానికి రూ.50 లక్షలు నిధులు ఇవ్వాలని కోరారు. రోగులకు 24 గంటలు సేవలను అందించే వైద్య సిబ్బందికి ప్రోత్సాహకాలతో పాటు బకాయి ఇన్సెంటివ్ ఇవ్వాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

రూ.78.60 లక్షలకు ఫెర్రీ వేలం పాట

ప్రజాశక్తి-కూనవరం

కూనవరం మండలం రుద్రమకోట ఫెర్రీ వేలం పాట గురువారం పంచాయితీ కార్యాలయంలో నిర్వహించారు. వేలేరుపాడు గ్రామానికి చెందిన బీరబోయిన కోటేశ్వరరావు రూ.78.60 లక్షలకు వేలం పాడి సొంతం చేసుకున్నాడు. గతేడాది రూ.80 లక్షల వరకు వెళ్లిన వేలం పాట ఈ ఏడాది రూ.2 లక్షలు తగ్గింది. ఈ కార్యక్రమంలో కూనవరం, రుద్రంకోట సర్పంచ్లు హేమంత్ కుమార్, లలిత కుమారి, ఎంపీటీసీ కొమ్మాని అనంత లక్ష్మి, వైస్ ఎంపీపీ బండారు సాంబ శివ, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రామాంజనేయప్రసాద్, విఆర్ పురం ఈఓపిఆర్డి శ్రీకాంత్ రెడ్డి, కూనవరం, రుద్రమ్మకోట సెక్రటరీలు సురేష్, దావీదు తదితరులు పాల్గొన్నారు.

జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలి

- కేజీ పిక్కలు రూ.200కు కొనుగోలు చేయాలి

- ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-కొయ్యూరు : జీడి పిక్కలు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని, కిలో రూ.200కు కొనుగోలు చేయాలని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం కొయ్యూరు మండల కార్యదర్శి ఎస్.సూరిబాబు ఆధ్వర్యాన గురువారం మండలంలోని చింతలపూడి, గింజర్తి, లుబుర్తి, మాకవరం గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఇందులో పాల్గొన్న అప్పలనర్స, సిపిఎం బృందం ఆయా గ్రామాల్లో జీడి తోటలను సందర్శించారు. అక్కడి రైతులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జీడీ మామిడి, కొండ పోడు పట్టాలు వంటి సమస్యలను రైతులు అప్పలనర్స దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం నేత అప్పలనర్స మాట్లాడుతూ అల్లూరి జిల్లా పరిధుల్లో సుమారు 5వేల ఎకరాలలో జీడి మామిడి సాగుచేస్తున్నారని, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గిరిజన సంక్షేమ శాఖ జోక్యం చేసుకుని ఐటిడిఏ ద్వారా జీడి పిక్కలను కొనుగోలు చేయాలని, తునికల్లో మోసాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీని వర్తింపు చేసి జీడి తోటలను అభివృద్ధి చేయాలని కోరారు. కొయ్యూరు కేంద్రంగా జీడి మామిడి పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక ఆదివాసీ యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించాలన్నారు. జీడి తోటలకు బీమా సదుపాయం కల్పించాలని, గిరిజనులు సాగు చేసుకుంటున్న కొండపోడుకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఆపాలని, మారుమూల గ్రామాల్లోని మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఎస్ ధర్మాన్నపడాల్, స్థానిక సర్పంచ్ సెగ్గి సన్యాసిరావు పాల్గొన్నారు.



రైతులతో కలిసి జీడి తోటలను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

జీడిమామిడి రైతు కమిటీ ఏర్పాటు

ఈ సందర్భంగా గ్రామస్తులు జీడి మామిడి రైతు కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కుర్రు లింగరాజు, ఉపాధ్యక్షులుగా రాంబాబు, పాంగి గంగరాజు, కార్యదర్శులుగా పోలోజు రమణమ్మ, కూడా లక్ష్మి, సభ్యులు ఎన్నికయ్యారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలి

డుంబ్రిగుడ : కండ్రుం పంచాయతీ జాకరగూడలో సిపిఎం నాయకులు గురువారం ప్రజా చైతన్య యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సమస్యలను అడిగి తెలుసుకుని ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటి సభ్యులు. టి.సూర్యనారాయణ మాట్లాడుతూ, విజె రోడ్డు నుండి సర్రాయి, కండ్రుం, డుంబ్రిగుడ వరకు నిర్మించిన నూతన పెద్ద బిడ్జి నుండి జకరగుడ వరకు రోడ్డు పనులు నిర్మాణం వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రోడ్డు సౌకర్యం లేక హహనాల రాకపోకలు చేయడానికి అరచేతిలో ప్రాణలు పెట్టు కొని ప్రయాణంచేయవలసిన పరిస్థితి నెలకొంధన్నారు. ప్రభుత్వం స్పందించి నూతన పెద్ద బిడ్జి నుంచి జకరగుడ వరకు రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కె రామచందర్ ,టి పరన్న, కె గోవర్ధన్ ,కె జిన్ను,కె లైకోన్, కె రఘు, తదితరులు పాల్గొన్నారు.

జన్మన్ గృహాలకు రూ.10లక్షలు ఇవ్వాలి

ముంచంగిపుట్టు : మండలంలోని జర్రెల పంచాయితీ పరిధిలోని బొడ్డగొంది, మంచంరాయి, మండిభ గ్రామంలో సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా చైతన్య యాత్రను ఆ పార్టీ పూర్వ నేత భీమరాజు ఆధ్వర్యంలో గురువారం చర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని చేపట్టారు. గ్రామాలలో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ సభ్యులు వంతల లైకోన్ మాట్లాడుతూ, పివిటిజిలకు పిఎం జన్మన్ గృహాలకు పది లక్షలు ప్రభుత్వం మంజూరు చేయాలన్నారు. పెండింగ్లో ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.బొడ్డగొంది నుంచి మంచంరాయి వరకు సుమారు కిలోమీటర్లు బిటి రోడ్డు, సిసి రోడ్లు, డ్రైనేజీలు మంజూరు చేసి నిర్మాణం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు కావస్తున్నా ఒక రేషన్ కార్డు, పింఛన్లు కొత్తవి మంజూరు చేయలేదన్నారు.పోడు భూములకు పట్టలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీసా కమిటీ సభ్యులు వి.జీలమందు. వి.నాగేష్ గ్రామ నాయకుడు, పి.దాస్సో పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో...నినాదాలు చేస్తున్న నాయకులు, గిరిజనులు



ముంచంగిపుట్టులో...గిరిజనులతో మాట్లాడుతున్న నేతలు



నినాదాలు చేస్తున్న సిపిఎం నేతలు, గిరిజనులు

చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని బాబుసాల గ్రామ పంచాయతీ బళ్ళుగూడ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారులను సిపిఎం మండల కార్యదర్శి కొర్ర త్రినాథ్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ, బల్లుగూడ గ్రామంలో గత వారం రోజులుగా ముగ్గురు చిన్నారులకు దగ్గు, జలుబు, జ్వరం తో పాటు శరీరంలో చిన్న చిన్న కురుపులతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ తూతూ మంత్రంగా వైద్య శాఖ సిబ్బంది వైద్య సేవలు అందించారని ఆగ్రహించారు. ముంచంగిపుట్టు, పాడేరు జిల్లా ఆసుపత్రిలో 14 మంది చిన్నారులు వైద్యం పొందుతున్నారన్నారు.గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గత రెండు ఏళ్లుగా మంచి నీటి కోసం అమర్చిన సోలార్ ప్లాంట్ మరమ్మతులకు గురైనప్పటికి అధికారులు స్పందించలేదన్నారు.ఇంటింటికి కుళాయి నీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో సుమారు 57 మంది విద్యార్థులు ఉన్నా ప్రభుత్వ ఉపాధ్యాయుడే లేడని, ఒక మాతృ భాష వాలంటీర్ తో విద్యా భోధన జరుగుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎంఎం శ్రీను, కె.నర్సయ్య, పి.దళపతి, దేవన, గ్రామస్థులు చిరంజీవి, సాంబ, కే శ్రీను, కామేష్, రమేష్ పాల్గొన్నారు.



బోరు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

తాగునీటి బోరు పనులు ప్రారంభం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: కొర్రా పంచాయతీ గొందిగుడలో తాటునీటి కష్టాలను తీర్చేందుకు జడ్పీటీసీ నిధులతో మోటారు బోరు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఆ పంచాయతీ సర్పంచి అర్జున్ బోరు నిర్మాణ పనులు ప్రారంభించారు. గొందిగుడలో నీటి వనరులు లేక గతంలో గ్రామస్థులు ఇబ్బందు పడేవారన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రవీణ్, వైకాపా మండల కార్యదర్శి బాలరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఐటిడిఎ పిఒ అపూర్వభరత్

డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి-చింతూరు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం వార్షికోత్సవం, డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్, గౌరవ అతిథిగా చింతూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నాగుల్ మీరా విచ్చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులను ఐటిడిఏ పిఒ అపూర్వ భరత్ అభినందించారు. 2021- 2024 బ్యాచ్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, నగదు బహుమతులు అందజేశారు. గౌరవ అతిథి షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి అవసరమైన అదనపు స్థలం కొరకు కృషి చేస్తున్న చింతూరు ఐటిడిఎ పిఒ, డిఎఫ్ఒ, ఎఫ్ఆర్ఒ, తహశీల్దారుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇటీవల పిఎం ఉచ్చితార్ శిక్ష అభియాన్ నుండి మంజూరైన రూ.5 కోట్లు సంబంధించిన వివరనాత్మక ప్రాజెక్టు నివేదికను సమర్పించి, పరిపాలన అనుమతుల కొరకు వేచి చూస్తున్నట్లు చెప్పారు. వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన క్రీడలు, పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చాటిన వారికి ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల సాంస్కృతిక విభాగ కార్యకర్త జి.హారతి, అధ్యాపకులు జి.వెంకటరావు, ఎం.శేఖర్ ఎన్.రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండల కేంద్రంలో ఉన్న కస్తూరాబాయి గాంధీ బాలికల విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి, ఇంటర్మీడియట్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పరిమళ తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. వీటితో పాటు 7వ తరగతిలో 2 సీట్లు, 8వ తరగతిలో 1సీటు, 9వ తరగతిలో 1 సీటు, పదవ తరగతిలో 8 సీట్లు, ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ-1 సీటు ఖాళీగా ఉన్నాయని, వాటికి కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. ఈనెల 22 నుండి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు.



ప్రిన్సిపల్ పరిమళ


శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న జెడ్పిటిసి, ఎంపిపి

అంగన్వాడీలకు శిక్షణ

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని చిలకలగెడ్డ ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలలో ఐసిడిఎస్ సిడిపిఒ సంతోష్ కుమారి ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చారు. స్థానిక జెడ్పిటిసి దీసరి గంగరాజు, ఎంపీపీ శెట్టి నీలవేణులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో అంగన్వాడీ కార్యకర్తలు కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. మండలంలోని అంగన్వాడీ కేంద్రాలకు భవనాల మంజూరుకు తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అప్పారావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ శాంతి ప్రియ, రామయమ్మ, శ్యామల కుమారి, అంగన్వాడీ యూనియన్ మండల ప్రతినిధులు సి ఎస్. కళావతి, . మంజుల, సుమిత్ర, పార్వతి సుబ్బలక్ష్మి కార్యకర్తలు పాల్గొన్నారు.

75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు

ప్రజాశక్తి -కోటవురట్ల: పశుగ్రాసం సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం 75శాతం రాయితీపై ఎస్ ఎస్ జి జొన్నరకం గడ్డి విత్తనాలు అందుబాటులో ఉంచామని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నరేష్ తెలిపారు. గురువారం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. 348 రూపాయలు విలువ చేసే విత్తనాలు 68 రూపాయలకు, మరో రకం 460 రూపాయలు విలువ గల విత్తనాలు 92 రూపాయలకు అందజేస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:గొలుగొండ మండలం పాతమల్లంపేట పంచాయతీ కొత్తపాలెం, ఉర్లంపేట, బుద్ధవరపాడు, నిమ్మగెడ్డ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సర్పంచ్ గెడ్డం ఆదిలక్ష్మి ఆనంద్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రత్యేక చొరవతో రూ.30లక్షలతో ఈ రోడ్ల నిర్మాణాలు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే రూ.38లక్షలతో పంచాయతీలోని పాకుంపేట, భీమునిపట్నం, చిన జగ్గంపేట గ్రామాల్లో సీసీ రోడ్లు పూర్తయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గెడ్డం నానాజీ, వార్డు మెంబర్లు బిడిజాన పోతురాజు, అడ్డూరు బంగారయ్య, మజ్జి స్వాములు, రుత్తల సత్యనారాయణ, మాకిరెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:గొలుగొండ మండలం ఏఎల్.పురం మేజర్ పంచాయతీలో గురువారం ఈవోపీఆర్డీ కే.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పిచ్చి మొక్కల తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. పారిశుద్ధ్య సిబ్బంది గ్రామంలోని అన్ని వీధుల్లో పిచ్చిమొక్కలను తొలగించి చెత్తా చెదారంను ఎత్తివేశారు. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలన్నారు. చెత్తను రోడ్లపై వేయరాదని చెప్పారు.

దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి- మాడుగుల:బాల కార్మికుల తనిఖీలలో భాగంగా సహాయ కార్మికాధికారి పి.సూర్యనారాయణ ఘాటీరోడ్డు కూడలిలో ఉన్న పలు దుకాణాలలో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ దాడుల్లో రెండు దుకాణాలపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. విజయ ఇంజినీరింగ్ వర్క్‌షాపు, క్రేజీ జ్యూస్ షాప్లో బాల కార్మికులు పని చేస్తున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. బాలకార్మికులకు తక్కువ జీతం ఇస్తున్నట్లు తెలుసుకున్నామని తెలిపారు. 18 సంవత్సరాలు నిండని పిల్లలకు పనిలో పెట్టవద్దని సహాయకార్మికాధికారి తెలిపారు.

సెల్ టవర్లకు కనెక్షన్లు ఏర్పాటు చేయండి

కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో సెల్ సిగ్నలింగ్ వ్యవస్థను మెరుగు పరచాలని, నిర్మాణాలు పూర్తైన సెల్ టవర్లకు ఆప్టికల్ ఫైబర్ లైన్లు వేసి కనెక్షన్లు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ నెట్ వర్క్ సంస్థలను ఆదేశించారు. గురువారం మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ నెట్ వర్క్ సంస్థలతో జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, సెల్ టవర్ల కోసం అనేక గ్రామాల నుండి దరఖాస్తులు అందుతున్నాయన్నారు. ఈ నేపధ్యంలో ముందుగా మంజూరైన సెల్ టవర్లను పనిచేసే స్థితికి తీసుకు రావాలని ఆదేశించారు. కొన్ని చోట్ల రహదారి సౌకర్యం లేనందున సెల్ టవర్ స్థలాన్ని మార్చాలని అడుగుతున్నారని, దీనిపై నెట్ వర్క్ సంస్థ, రెవిన్యూ, అటవీ శాఖలు జాయింట్ సర్వే నిర్వహించి ఫీజిబిలిటి పరిశీలించాలన్నారు. ఒకవేళ మార్పులకు వస్తే మంజూరైన గ్రామంతో పాటు ఎన్ని గ్రామాలకు సెల్ సిగ్నల్ వస్తున్నదీ, ఎన్ని కుటుంబాలు లబ్ది పొందుతున్నదీ సమగ్ర నివేదిక అందజేయాలని ఆదేశించారు. బిఎస్ఎన్ఎల్ కు మంజూరైన 941 సెల్ టవర్లకు 604 పూర్తయ్యాయని, మిగిలిన 337 ప్రాంతాల్లో సెల్ టవర్ల నిర్మాణం పూర్తిచేసినట్లైతే ఆప్టికల్ ఫైబర్ కనెక్షన్లు ఇవ్వలేదని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తైన 604లో కొన్ని పని చేయలేదని ఫిర్యాదులు అందుతున్నందున వాటిని సరిచేయాలని ఆదేశించారు. జియో నెట్ కు సంబంధించి 520 టవర్లు మంజూరు కాగా 437 పనిచేస్తున్నాయని, మిగిలినవి వివిధ దశలలో ఉన్నందున వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. ఎయిర్ టెల్ నెట్ వర్క్ కు సంబంధించి 139 మంజూరు కాగా 130 పూర్తయ్యాయని అందులో 76 పని చేస్తున్నాయని మిగిలిన వాటికి వెంటనే కనెక్షన్లు ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎంజె అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, ఎపి ఫైబర్ జిల్లా ప్రతినిధి నాయుడు, జియో ప్రతినిధి సత్య ప్రసాద్, బిఎస్ఎన్ఎల్, బిఎస్ఎన్ఎల్, ఎయిర్ టెల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పలు రకాల పోస్టర్ల ఆవిష్కరణ

: కలెక్టర్ ఛాంబర్లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో విశాఖ జిల్లా నవ నిర్మాణ సమితి ఆధ్వర్యంలో రూపొందించిన మంచి నీటి పరిరక్షణ-పంచ సూత్రాలు, జల్ జీవన్ మిషన్ వర్కింగ్ ప్రాసెస్, విడబ్ల్యుఎస్ సి విధులు బాధ్యతలు, సుజల సూక్తులు తదితర ఐదు రకాల పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. నీటిని వృధా చేయరాదని, ప్రతి నీటి బొట్టును పొదుపు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా నవ నిర్మాణ సమితి కార్యదర్శి ఎ.రఘురామ్, సీనియర్ మేనేజర్లు కే. రవికుమార్, వివిఎస్ఎస్ఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన 20 వ మంది విధ్యార్థులతో యోగ సాధన కార్యక్రమంపై జరిగిన సమావేశం అనంతరం రాష్ట్ర ప్రణాళిక శాఖ రూపొందించిన పి4 పోస్టర్ (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్ పార్టిసిపేషన్) ను జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పేదరికం లేని సమాజం నిర్మాణానికి పి 4 సర్వే ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్ఓ కే.పద్మలత, డిపిస్ మెహబూబ్ అహ్మద్, సిపిఒ ఎస్ఎస్ఆర్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బైక్‌ను ఢీకొన్న కారు : ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ:మండలంలోని అరకు, పాడేరు ప్రధాన రహదారి బురదగెడ్డలో బైకును కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికీ గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు... కొర్రాయి పంచాయతీ జాకరవలస గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు అరకు నుంచి స్వగ్రామానికి ప్రయాణిస్తుండగా, పాడేరు నుంచి అరకు వస్తున్న కారు యిరదగెడ్డ మలుపులో బైకును బలంగా ఢీకొంది. బైకుపై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని బుచ్చిరాజుపేట పంచాయతీ నల్లమట్టిపాలెం గ్రామానికి చెందిన నల్లమట్టి రాము (54) అనుమానస్పదంగా మృతి చెందినట్లు మృతిని కుమారుడు దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సన్ని బాబు తెలిపారు. నల్లమట్టి రాము బుధవారం సాయంత్రం కల్లు తాగేందుకు రాజయ్యపేట వెళ్లాడు. గురువారం ఉదయం కల్లు విక్రయించే పాకల వద్ద రాము మృతదేహం ఉండడంతో స్థానికులు రాము కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు సంఘటన ప్రాంతానికి చేరుకుని, రాము మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జీడిమామిడి తోటల దగ్ధం

ప్రజాశక్తి రావికమతం: మండలంలో చినపాచిల గ్రామంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో పలువురి రైతుల జీడి మామిడి తోటలుతో పాటు ఒక పశువుల పాక ఖాళీ బుడదయ్యాయి. వివరాలు ప్రకారం... గురువారం మధ్యాహ్నం చినపాచీల రైతు భరోసా కేంద్రం సమీపంలో ఉన్న కరెడ్ల సత్యారావు, శివయ్య నాయుడు, చిన సత్యారావు, నల్లప్పనాయుడు జీడి మామిడి తోటలు, కరెడ్ల దేవుళ్ళు పశువుల పాక ఖాళీ బుడదయ్యాయి. ఈ సమాచారాన్ని తెలుసుకున్న రావికమతం, మాడుగులకు చెందిన అగ్నిమాపక శకటం సిబ్బంది మంటలను అదుపు చేశాయి.ఏడాదికి ఒకమారు చేతికి వచ్చే జీడిమామిడి తోటలు పువ్వు, కాయ, పళ్ళతో ఉన్న చెట్లు కాలిపోవడంతో పూర్తిగా నష్టపోయినట్లు బాధిత రైతులు పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.నష్టపరిహారం ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

పోరుబాటలో చెరుకు రైతు

- కలిసి కదలనున్న కార్మికులు
- నేడు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద మహాధర్నా
- బిల్లులు, జీతం చెల్లించని యాజమాన్యం
- ప్రభుత్వం సహాయ నిరాకరణ
- పట్టించుకోని ఎంపీ, ఎమ్మెల్యేలు


మహాధర్నా ప్రచారంలో మాట్లాడుతున్న వివి శ్రీనివాసరావు


ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

గోవాడ సహకార సుగర్ ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేసే రైతు, కార్మికులు ఏకమయ్యారు. జరుగుతున్న అన్యాయంపై నిరసన తెలపడానికి సిద్ధమయ్యారు. చెరుకు సరఫరా చేసినప్పటి నుంచి ఇంతవరకు టన్ను చెరుకుకు యాజమాన్యం పైసా బిల్లు చెల్లించలేదు. కార్మికులకు జీతం ఇవ్వలేదు. రాష్ట్రంలో ఏకైక సహకార సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఆధునీకరించకపోగా, వదిలించుకోవాలని చూడ్డంతో రైతులు, కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ విధానాలతో ఫ్యాక్టరీ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. అయినా కనీస ఆర్థిక సహకారం ప్రభుత్వం అందించడంలేదు. క్రషింగ్ సామర్థ్యానికి తగినట్లు యంత్రాలను సిద్ధంచేయలేదు. తరచూ ఫ్యాక్టరీ మరమ్మతులకు గురవడంతో రైతులు యార్డుల్లో రోజులు తరబడి ఉండాల్సిన పరిస్థితి వస్తోంది. ఎక్కువ రోజులు ఎండలో చెరుకు ఉండడంతో బరువు తగ్గి రైతుకు నష్టం వాటిల్లుతోంది. అయినా వాటన్నింటినీ భరించి చెరుకు సరఫరా చేస్తున్నప్పటికీ, ఒక్క పైసా కూడా రైతుకు చెల్లించలేదు. గతేడాది బకాయి ఇవ్వలేదు. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులకు జీతం చెల్లించలేదు. ఎంపీ సిఎం రమేష్, ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు వారి సమస్యలను పట్టించుకోలేదు. తమ బకాయిలు చెల్లించేలా యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చేందుకు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ పోరాట కమిటీ నేతృత్వంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద రైతులు, కార్మికులు మహాధర్నా చేపట్టనున్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రక్షణ రైతులు, కార్మికుల కర్తవ్యంగా మారింది.

రైతులకు బిల్లులు, కార్మికులకు జీతం చెల్లించక కుటుంబ అవసరాలకు అప్పులు చేస్తున్నారు. ఈ నెల 10వ తేదీన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతుల సమస్యలు తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు... రైతులకు బిల్లు బకాయిలు, కార్మికులకు జీతం చెల్లించడానికి తక్షణ సాయం కింద రూ.35 కోట్లు ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అయినా ఈ ప్రభుత్వం చెవికి రైతుల బాధ విన్పించినట్లులేదు. రోజుకు నాలుగువేల టన్నుల సామర్థ్యంకల్గిన ఫ్యాక్టరీ 1500 టన్నులకు మించి క్రషింగ్ చేయడంలేదు. ఈ ఫ్యాక్టరీని ఆధునీకరిస్తే తప్ప తమకు శాశ్వత పరిష్కారం లభించదని రైతుకు అర్థమైంది. ఇందుకు రూ.350 కోట్లు ప్రభుత్వం సహాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

తక్షణమే బకాయిలు చెల్లించాలి

రైతులు, కార్మికులకు బకాయిలు చెల్లించాలి. గతంలో రైతుకు ఇచ్చిన రాయితీలన్నీ పునరుద్ధరించాలి. పూర్తి సామర్థ్యంతో ఫ్యాక్టరీని నడపాలి. ఫ్యాక్టరీని ఆధునీకరిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన మాట కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. యాజమాన్యం, ప్రభుత్వం రైతులు, కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తాం.



కర్రి అప్పారావు,
ఎపి చెరకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మూల్యాంకన నుంచి
మినహాయింపు నివ్వండి

ప్రజాశక్తి - ఆరిలోవ : వచ్చేనెల 3 నుంచి నిర్వహించే పదోతరగతి స్పాట్ వేల్యూయేషన్‌కు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, శారీరక, మానసిక వైకల్యం, 58 ఏళ్లు నిండిన వారు, ఎంఆర్ పిల్లలు ఉన్నవారికి లాక్టేటెడ్ మదర్స్‌కు మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ కోరింది. గురువారం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్‌ను యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేడ్కర్, జిల్లా కోశాధికారి కె.రాంబాబు, కార్యదర్శి టి.జగన్ కలిసి వినతతి పత్రం అందజేశారు.


విశాఖ డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

చెట్టును ఢీకొన్న బైక్ : నాలుగేళ్ల చిన్నారి దుర్మరణం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో నాలుగేళ్ల చిన్నారి దుర్మరణం చెందిన సంఘటన మారేడుమిల్లి మండలం దేవరపల్లి గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మారో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... రంపచోడవరం మండలం రాకోట గ్రామానికి చెందిన కుర్ల పెంటారెడ్డి, నూకలేటి బాపనమ్మ, వర్ధిని, నూకలేటి హంస గీత (4)తో కలిసి చుట్టపు చూపు నిమిత్తం తమ బంధువుల ఇంటికి జీఎం వలస గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. అనంతరం అక్కడి నుండి తమ గ్రామానికి తిరుగు ప్రయాణంలో దేవరపల్లి సమీపంలోని టేక్ ప్లాంటేషన్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాలుగేళ్ల చిన్నారి హంసగీత అక్కడికక్కడే మృతి చెందగా, పెంటారెడ్డి, బాపనమ్మ, వర్ధినికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న మారేడుమిల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఎస్ఐ సాదిక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

ఉపాధి హామీపై ఆరోపణలు అవాస్తవం

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీలో ఉపాధి హామీ పనులు కల్పించడం లేదనడం అవాస్తవమని, ఇక్కడ ముమ్మరంగా పనులు జరుగుతున్నాయని ఎన్ఆర్ఇజిఎస్ టెక్నికల్ అసిస్టెంట్ చిన్నబ్బాయి, ఫీల్డ్ అసిస్టెంట్ గురునాథ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోనూ, జిల్లాలోనూ అత్యధిక పని దినాలు కల్పించిన పంచాయతీ దుప్పిలివాడ అని తెలిపారు. పీసా కమిటీ నాయకులు తమపై తప్పుడు ప్రకటనలు చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ పరిధిలో 31 గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయని, 1,113 జాబు కారులకు గాను 1105 జాబు కార్డులు ఉన్నవారు ఉపాధి పనులు పొందుతున్నారని తెలిపారు.

సాంకేతికపరమైన సమస్యల వల్ల ఒక్కొక్క వారం ఒక్కొక్క ఊర్లో పనులు ఆగుతున్నాయే తప్ప, ఎక్కడా పనులు జరగకపోవడం లేదని పేర్కొన్నారు. ఉపాధి కూలీలందరూ సంతృప్తిగా పనులు చేసుకుంటున్నారని తెలిపారు. కూలి పనులు లేక వలస వెళ్లారని తప్పుడు ప్రకటన చేయవద్దని హితవు పలికారు.

తప్పడు ప్రకటనలు సరికాదు : సర్పంచ్

దుప్పుల వాడు పంచాయతీలో ఉపాధి హామీ పనులు లేవని పీసా కమిటీ నాయకులు ప్రకటనలు అవాస్తమని సర్పంచ్ కేలేవు కుమారి పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలో అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయని, ఎవరు ఎక్కడికి వలసి వెళ్లలేదని తెలిపారు. ఇప్పటికైనా పీసా కమిటీ నాయకులు తప్పుడు ప్రకటనకు స్వస్తి పలకాలని హితవుపలికారు.

భానుడి భగభగలు

సీలేరులో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
బెంబేలెత్తుతున్న మన్యం వాసులు


నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి-సీలేరు : మార్చి నెలలోనే భానుడి భగభగలు మొదలయ్యాయి. జికె.వీధి మండలం సీలేరులో ఎండలు తీవ్రత రోజురోజుకు పెరుగుతూ అధిక ఉష్ణోగ్రతను నమోదవుతున్నాయి. ఉదయం 6.30 గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం 2.54 గంటలకు సీలేరులో 40 డిగ్రీలు గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. గత రెండు మూడు రోజులుగా 38, 39 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు కాగా, గురువారం మరింత తీవ్రతరమై 40 డిగ్రీలకు చేరుకోవడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దీర్ఘకాలక రోగాలతో బాధపడుతున్న రోగులు, చిన్నారులు, వృద్ధులు ఎండలకు తట్టుకోలేక సతమతమవుతున్నారు. ఎండ తీవ్రత వల్ల గురువారం ప్రజలు సంచారం లేక సీలేరు మెయిన్ బజార్, ఏపీ జెన్కో కాలనీ పరిసరాల్లో నిర్మానుష్యంగా మారాయి. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంత గిరిజనులు ఎండ తీవ్రతకి తట్టుకోలేక పచ్చని చెట్లు వద్ద ఉంటూ ఎండ తగ్గుముఖం పట్టిన తర్వాత వారి ఇళ్లకు వెళ్తున్నారు. వేసవి తాపానికి పుచ్చకాయలు, శీతలపానీయాలతో ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. శరీరం డీహైడ్రేషన్‌కు గురి కాకుండా ద్రవ రూపంలో ఉన్న పదార్థాలను స్వీకరించాలని వైద్యులు సూచిస్తున్నారు.

పంచాయతీ పారిశుధ్య కార్మికుల సమస్యలపై వినతి



వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి -సీలేరు : జికె.వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వారాంతపు సెలవులు ఇవ్వాలని కోరుతూ సిఐటియు నాయకులు గురువారం పంచాయతీ కార్యదర్శి పరశురాం, సర్పంచ్ దుర్జోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సిఐటియు సీలేరు గౌరవ అధ్యక్షులు ఎస్కే సుభాన్, ఇతర నాయకులతో కార్యదర్శి, సర్పంచి సమావేశమై పారిశుధ్య కార్మికులకు సంబంధించిన అనేక అంశాలపై చర్చించారు. పంచాయతీ కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ కట్టాలని, వారికి నేరుగా పనులు అప్పగించాలని కోరారు. చాలీచాలని జీతాలతో పారిశుధ్య కార్మికుల జీవన పరిస్థితి దుర్భరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనికి కార్యదర్శి, సర్పంచ్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కే వల్లి ప్రసాద్, సిఐటియు బ్రాంచ్ అధ్యక్షులు బి.లక్ష్మణ్, కార్యదర్శి విష్ణుకుమార్, నాయకులు మొండి రమణ, జనసేన నాయకుడు వనమల రాము పాల్గొన్నారు.

జీడిమామిడి తోటలు దగ్ధం

- రూ.5 లక్షలు ఆస్తి నష్టం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని బడదనాంపల్లి పంచాయతీ సమీపంలోని కొండని ఆనుకుని ఉన్న జీడి తోటలకు బుధ, గురువారాల్లో కొండపై నుండి అగ్ని కీలలు వ్యాపించి సుమారు సుమారు 9 ఎకరాల పైబడి జీడి మామిడి తోటలు దగ్ధమయ్యాయి. సుమారు రూ.5 లక్షలకు పైబడి ఆస్తి నష్టం సంభవించిందని బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. బడదనాంపల్లి గ్రామానికి చెందిన బాబురావు, కె అప్పలరాజులకు సంబంధించిన జీడితోటలు కాలిపోవడంతో రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించింది. ఆరు గాలం శ్రమించడంతో పాటు ఎరువులు, పురుగులు మందులు, కూలీ రూపేనా పంటపై వేలాది రూపాయలు అప్పులు చేసి పెట్టుబడి పెట్టామని బాధిత రైతులు బాబురావు, అప్పలరాజు తెలిపారు. పంట చేతికొస్తే చేసిన అప్పులు తీర్చడంతో పాటు కుటుంబ పోషణ సాగుతుందని భావిస్తున్న తరుణంలో తోటలు పిందె దశలో ఉండగా, అగ్నికి ఆహుతికావడం జీర్ణించుకోలేకపోతున్నామని బాధితులు లబోదిబోమంటున్నారు. చేసిన అప్పులు ఎలా తీర్చాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మండలంలోని లాగరాయి, జడ్డంగి, వాతంగి తదితర ప్రాంతాల్లో కూడా జీడి మామిడి తోటలు దగ్ధమై లక్షలాది రూపాయలు ఆస్తి నష్టం సంభవించడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.


బందమామిడిలో దగ్ధమైన జీడితోట

23న ఎపి బాడీ లిఫ్టింగ్ జట్లఎంపిక

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరంలోని రామాటాకీస్ దరి వాయుపుత్ర హెల్త్ క్లబ్‌లో ఈనెల 23న ఆదివారం ఉదయం 10 గంటలకు ఆంధ్ర బాడీ లిఫ్టింగ్ జట్టును ఎంపిక చేయనున్నట్లు ఆంధ్ర బాడీ లిఫ్టింగ్ సంఘం ప్రెసిడెంట్ ఎస్ఎస్.శివశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు వెయిట్ వయస్సు విభాగాల్లో వేర్వేరుగా ఎంపికలు జరుగుతాయ మాస్టర్స్ విభాగంలో 45, 50, 55, 60 ఏళ్ల దాటిన కేటగిరిలోనూ వికలాంగులకు 65 కిలోల లోపల, 65 కిలోల పైన రెండు విభాగాల్లో ఎంపికలు ఉంటాయన్నారు ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 26 ,27 తేదీల్లో పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో జరిగే 15వ జాతీయ బాడీ లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తి గలవారు ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో వాయుపుత్ర హెల్త్ క్లబ్‌కు హాజరు కావాలన్నారు మరిన్ని వివరాలకు 8885203519 మొబైల్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

ధారాలమ్మ పండగ ముహూర్తపు రాట

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం ధారకొండ ఘాట్ రోడ్‌లో ఉన్న ధారాలమ్మ అమ్మవారి పండగ ఈనెల 29 జరగనున్న నేపథ్యంలో ఆలయం వద్ద గురువారం ముహూర్తపు రాట వేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు సమక్షంలో ముహూర్తపురాట వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారు పండగ ఘనంగా నిర్వహించడానికి కలిసికట్టుగా రాజకీయాలకతీతంగా పనిచేయాలని సూచించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో దామనాపల్లి సర్పంచ్ కొంజేటి రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు జడ్డంగిలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి :మండలంలోని జడ్డంగి పీహెచ్‌సీ వద్ద శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పీహెచ్సీ వైద్యాధికారి నాగార్జున గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్నవారు శుక్రవారం జడ్డంగి పిహెచ్‌సి వద్దకు రావాలని కోరారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ వైద్య శిబిరం ఉంటుందని, కంటి వైద్య నిపుణులు కంటి పరీక్షలు చేసి ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. కంటి రోగులు తమతో ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డ్, బ్యాంక్ బుక్ తీసుకొని రావాలని కోరారు. కంటి రోగులను తరలించేలాగా ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది చొరవ చూపాలని సూచించారు.

70 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-దేవీపట్నం : మండలంలోని ఎస్.రామన్నపాలెం శివార్లలో నాటు సారా కాస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు గురువారం మధ్యాహ్నం పోలీసులు మెరుపుదాడి చేశారు. నాటుసారా కాస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి, ఆయన వద్ద నుండి 70 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి ఉపయోగించే పెద్ద గిన్నె ధ్వంసం చేశారు. అరెస్టు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ తెలిపారు.


10 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - కొత్తకోట: ఏజెన్సీ ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న పది కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. గురువారం స్థానిక విలేకరులకు అందించిన వివరాల మేరకు....అల్లూరి జిల్లా ఏజెన్సీ నుంచి కొత్తకోట మీదుగా గంజాయి తరలిస్తున్నట్టు ముందస్తు సమాచారం అందడంతో దొండపూడి చెక్ పోస్ట్ వద్ద సిబ్బందితో వాహనతనిఖీలు చేపట్టామన్నారు. ఆటోలోని ఇద్దరు వ్యక్తుల బ్యాగులు తనిఖీ చేయగా, సుమారు రూ 30 వేలు విలువైన గంజాయి వుందన్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా పెదబయలు మండలం జామిగూడ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపాడు. నిందతులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.


పోలీసులు పట్టుకున్న గంజాయితో నిందితులు

డిటిగా తేజస్విని బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అడ్డతీగల :అడ్డతీగల మండల డిప్యూటీ తహశీల్దారుగా తేజస్విని గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఇప్పటివరకు రాజవొమ్మంగి మండలం డిప్యూటీ తహశీల్దారుగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా అడ్డతీగల వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం తనకు ఉందని ఆమె తెలిపారు.


డిటిగా బాధ్యతలు స్వీకరించిన తేజస్విని